

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:25 శనివారం
సహర్ 4:54 ఆదివారం

రహదారుల అభివృద్ధికి నిధులు




- సీఐఆర్ఎఫ్ కింద నాలుగు రోడ్ల అభివృద్ధి
- రూ.107 కోట్లు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- ధన్యవాదాలు తెలిపిన ఎంపీ బండి సంజయ్‌కుమార్



కరీంనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర రహదారుల, మౌలిక సదుపాయాల నిధి (సీఆర్ఐఎఫ్) కింద కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలోని నాలుగు రోడ్ల నిర్మాణాలకు 107 కోట్ల రూపాయలను కేంద్రం మంజూరు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 31 రోడ్ల నిర్మాణ పనులకు 850 కోట్ల రూపాయలను మంజూరు చేస్తూ కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ మంత్రిత్వశాఖ కార్యదర్శి కమల్ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేయగా అందులో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధికి చెందినవి నాలుగు రోడ్లు ఉన్నాయి. కేంద్రం మంజూరు చేసిన 107 కోట్ల రూపాయలతో గన్నేరువరం నుంచి బెజ్జంకి వరకు 23 కిలోమీటర్ల రోడ్డును డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేస్తారు. అలాగే చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మల్యాల గ్రామం నుంచి నూకపల్లి, రామన్నపేట మీదుగా కాచారం వరకు గల 11.70 కిలోమీటర్ల రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరిస్తారు. దీనికి 25 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అంతక్కపేట గ్రామం నుంచి కొత్తకొండ గ్రామం వరకు 10 కి.మీ. పొడువున ఉన్న రోడ్డును డబుల్ రోడ్డుగా మారుస్తారు. అలాగే హుస్నాబాద్ నుంచి రామవరం వరకు గల 11.50 కిలోమీటర్ల రోడ్డును 25 కోట్లతో డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేస్తారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రోడ్లను అభివృద్ధి పరచాలని ఎంపీ బండి సంజయ్‌కుమార్ చేసిన ప్రతిపాదనలను కేంద్రం ఆమోదించింది. నియోజకవర్గ పరిధిలోని నాలుగు రోడ్ల అభివృద్ధి కోసం 107 కోట్ల రూపాయలను మంజూరు చేయడం పట్ల సంజయ్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి సంజయ్ కృతజ్ఞతలు తెలిపారు. గతంలో రోడ్ల అభివృద్ధి కోసం తాము పలు ప్రతిపాదనలు చేసినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం అందక పోవడంతో నిధుల మంజూరుకు పనులు చేపట్టేందుకు వీలు లేకుండా పోయిందని, ప్రస్తుత ప్రభుత్వం లాగా గతం ప్రభుత్వం సహకరించి ఉంటే ఇప్పటికే పలు నిధులు అందేవని ఆయన అన్నారు.

• సీఐల బదిలీలు



కరీంనగర్ క్రైం, మార్చి 15: కమిషనరేట్‌లోని పలువురు సీఐలకు బదిలీలు జరిగాయి. కరీంనగర్ మూడో టౌన్ సీఐగా ఇటీవల బదిలీపై వచ్చిన వై చంద్రశేఖర్ గౌడ్‌ను మల్టీజోన్-1లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. కరీంనగర్ మూడో టౌన్ సీఐగా హైదరాబాద్‌లో ఏసీబీలో విధులు నిర్వహిస్తున్న సీఐ జి జాన్‌రెడ్డిని నియామకం చేశారు. కొంతకాలం వరకు హుజురాబాద్ సీఐగా పనిచేసి బదిలీ అయి పోస్టింగ్ కోసం ఎదురు చూసస్తున్న బబి రమేష్‌ను మళ్లీ హుజూరాబాద్ సీఐగా నియామకం చేశారు. అలాగే మల్టీజోన్-1 కార్యాలయంలో పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఏ రాంబాబును రెండు రోజుల కిందట హుజూరాబాద్ సీఐగా బదిలీ చేశారు. ప్రస్తుతం ఆ బదిలీని రద్దు చేశారు. ఈ మేరకు మల్టీ జోన్-1 ఐజీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇంటర్ ఒకేషనల్ పరీక్షలకు 160 మంది గైర్హాజరు

కరీంనగర్ టౌన్, మార్చి 15: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఒకేషనల్ పరీక్షలకు 160 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జరిగిన పరీక్షకు 1,229 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 160 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా కాపీయింగ్ జరుగలేదని అన్నారు.

విటమిన్ గార్డెన్లు ఏర్పాటు చేయండి

• కలెక్టర్ పమేలా సత్పతి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, మార్చి 15: జిల్లాలోని పాఠశాలల్లో పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు విటమిన్ గార్డెన్స్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోషణ పక్షోత్సవాలపై ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విటమిన్ గార్డెన్లలో పోషకాహార కూరగాయలు పండించాలని అన్నారు. మహిళలు, విద్యార్థులకు పోషకాహార ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పోషకాహార లోపం వల్ల కలిగే అనర్థాలను వివరించాలని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో పోషకాహారం తయారు చేసుకునేలా చైతన్యం తేవాలని సూచించారు. 6,7,8 తరగతుల విద్యార్థులకు ప్రతి వస్తువుపై ఉన్న లేబుల్స్ తెలిసేలా వారంలో ఒక రోజు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు చేసిన వస్తువును పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. జిల్లా, మండల స్థాయిలో ఫుడ్ తయారీపై పోటీలు నిర్వహించాలని తెలిపారు. ఇందులో ప్రతిభ చూపిన భార్యాభర్తలకు బహుమతులు అందజేస్తామని అన్నారు. బాల్య వివాహాల నియంత్రణకు అందరూ సహకరించాలని సూచించారు.

• బాలికల్లో ఆత్మస్థయిర్యం పెంపొందించాలి

చదువులోనే కాకుండా వ్యక్తిగత పరిశుభ్రత, సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలపై బాలికలకు అవగాహన కల్పిస్తూ వారిలో ఆత్మస్థయిర్యం పెంచేలా అందరూ కృషిచేయాలని జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యూనిసెఫ్ ఆధ్వర్యంలో రుతుస్రావ పరిశుభ్రతపై అవగాహన కల్పించే అంశంపై జిల్లా స్థాయి అధికారుల కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు, మహిళలు రుతుస్రావ శుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో బాలికలకు అవసరమైన వసతుల కల్పనకు సహకరిస్తామని తెలిపారు. కొన్ని ప్రైవేట్ హాస్పిటల్స్‌లో అనవసరమైన ఆపరేషన్లు నిర్వహిస్తున్నారని, దీంతో మహిళలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వీటిని నియంత్రించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అమ్మ ఆదర్శ కమిటీలతో ప్రతి గ్రామాల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ఏర్పాటు చేసిన బోర్డును ప్రారంభించారు. అదే విధంగా అధికారులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీపీవో రవీందర్, డీఈవో జనార్ధన్‌రావు, డీఆర్డీవో శ్రీధర్, మెప్మా పీడీ రవీందర్, గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కృపారాణి, యూనిసెఫ్ సమన్వయకర్త కిషన్‌స్వామి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో సాంకేతిక విప్లవం సృష్టించాలి

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- వ్యవసాయ, మెడికల్ కళాశాల పనుల ప్రారంభం
- ఖాజీపూర్‌లో సబ్‌స్టేషన్ ప్రారంభం

కరీంనగర్ రూరల్, మార్చి 15: వ్యవసాయంలో సాంకేతిక విప్లవం సృష్టించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ రూరల్ మండలంలోని మొగ్దుంపూర్‌లో వ్యవసాయ డిగ్రీ కళాశాల, కొత్తపల్లిలో మెడికల్ కళాశాల పనులకు శంకుస్థాపన చేశారు. కొత్తపల్లి మండలంలోని ఖాజీపూర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామినాథన్‌ను స్ఫూర్తిగా తీసుకుని వ్యవసాయ రంగంలో ముందుకసాగాలన్నారు. నిరుద్యోగం పెరిగిపోయి వ్యవసాయం వైపు అందరూ చూడాల్సిన పరిస్థితులు వస్తాయన్నారు. రైతే దేశానికి వెన్నెముక అని వ్యవసాయ కళాశాలను మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే మంజూరు చేయించారని, కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉండేదన్నారు. రాజకీయాల కతీతంగా పనిచేస్తున్నామన్నారు. మొగ్దుంపూర్‌లో డంప్‌యార్డు ఉండేదని, కళాశాల నిర్మాణం చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా, వ్యవసాయ కుటుంబ సభ్యునిగా వ్యవసాయంపై అవగాహన ఉందన్నారు. విద్యార్థులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి అవగాహన పెంచుకోవాలన్నారు. తక్కువ నీటితో పండించే పద్ధతులతో వినూత్న వ్యవసాయానికి మారాలన్నారు. అనంతరం వ్యవసాయ కళాశాల విద్యార్థినిలతో మాట్లాడారు.



కొత్తపల్లిలో మెడికల్ కళాశాల పనులను ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

• కొత్తపల్లి మెడికల్ కళాశాల అభివృద్ధి పనులు ప్రారంభం

కొత్తపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరీంనగర్‌లో మెడికల్ కళాశాల మంజూరు చేయాలని కోరుతూ తాను దీక్ష చేపట్టానన్నారు. అదే మెడికల్ కళాశాల పనులను రాష్ట్రమంత్రిగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, శాసన సభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత, ఆర్‌డీఓ మహేశ్వర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, నియోజక వర్గఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నారాయణపూర్ కుడికాలువ పనులు పూర్తి చేయిస్తా



ఉప్పరమల్యాలలో సబ్ స్టేషన్ పనులను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

గంగాధర: సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న నారాయణపూర్ రిజర్వాయర్ కుడికాలువ పనులు పూర్తి చేయించి సాగునీ రందిస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం గంగాధర మండలం ఉప్పరమల్యాలలో 1.76కోట్లతో చేపడుతున్న సబ్‌స్టేషన్ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విద్యుత్ అంతరాయాలు లేకుండా చూసేందుకు కొత్త సబ్‌స్టేషన్లు ఉపయోగపడతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కరువును తెచ్చిందని కొందరు మూర్ఖులు ఆరోపిస్తున్నారని మడ్డిపడ్డారు. ప్రకృతి వైపరీత్యానికి రాజకీయం అట్టగట్టడం వారి సంకుచిత బుద్ధికి నిదర్శనమన్నారు. నారాయణపూర్ కుడి, ఎడమ కాలువ పనులపై గత ప్రభుత్వం నిర్లక్షం చేసిందన్నారు. త్వరలో కాలువ పనులు ప్రారంభించి సాగునీటి కష్టాలు తీరుస్తామని మంత్రి రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి, జడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ, ఆర్డీవో మహేశ్వర్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్, వైస్ ఎంపీపీ రాజగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ ముద్దం జమునగాగేష్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడితే కఠిన చర్యలు

• ఏసీపీ శ్రీనివాస్‌జీ



శంకరపట్నం మండలం మెట్‌పల్లిలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

శంకరపట్నం, మార్చి 15: వాట్సాప్, ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియాలో అసభ్యకరమైన, రెచ్చ గొట్టే విధంగా పోస్టులు పెడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. శుక్రవారం శంకరపట్నం మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి భయ భ్రాంతులకు, ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో చిన్న చిన్న కేసులే జీవితాంతం ఇబ్బందులకు గురిచేసాయన్నారు. ప్రజలు ఎన్నికల నిబంధనలకు లోబడి నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో కేశవపట్నం, సైదాపూర్ ఎస్ఐలు పాకాల లక్ష్మారెడ్డి, జన్ను ఆరోగ్యం, కేంద్ర బలగాలు,స్థానికపోలీసులు తదితరులు పాల్గొన్నారు.

వస్తువు కొనుగోలు చేసినపుడు విధిగా బిల్లు తీసుకోవాలి

కరీంనగర్ టౌన్, మార్చి 15: మార్కెట్‌లో ఏ వస్తువు కొనుగోలు చేసినా అందుకు సంబంధించిన బిల్లును విధిగా తీసుకోవాలని, ఏదైనా కారణం చేత వినియోదారుడికి నష్టం వాటిల్లితే వినియోగదారుల సంక్షేమ సంస్థలను ఆశ్రయించి నష్టపరిహారం పొందే వీలుంటుందని తెలంగాణ వినియోగదారుల జిల్లా అధ్యక్షుడు వంగ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వినియోగదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారులు నష్టపోతే జిల్లాలో 20 లక్షల రూపాయల వరకు నష్టపరిహారం వేయవచ్చని, కోటి రూపాయల వరకు రాష్ట్ర సంక్షేమ సంస్థల్లో పరిహారం కోరవచ్చని అన్నారు. కోర్టులను కూడా ఆశ్రయించే అవకాశాలుంటాయని అన్నారు. వినియోగదారులు మోసపోకుండా చైతన్యపరిచేందుకు అవగాహన సదస్సు నిర్వహించాల్సిన అవసరముందని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పామరాజు రామారావు, గడప కోటేశ్‌కుమార్, నార్ల వేణుగోపాల్, గునుకుల సత్యానారాయణరెడ్డి, గంగాధర రజనీకాంత్, కనపర్తి రమేశ్, కంటె తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

• మహిళలు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

జమ్మికుంట రూరల్ : సమాజంలో జరిగే మోసాలపై ప్రశ్నించే తత్వాన్ని మహిళలు అలవర్చుకోవాలని బాల వికాస జమ్మికుంట సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన అన్నారు. శుక్రవారం జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలో బాల వికాస ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకుని మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పబ్బు సులోచన మాట్లాడుతూ వినియోగదారుల చట్టం 1986లో వచ్చినప్పటికీ ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయడం లేదన్నారు. ఇలాంటి చట్టాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్యక్రమంలో బాలవికాస కో-ఆర్డినేటర్ స్వాతి, సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలు, విలీన డివిజన్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

• మేయర్ యాదగిరి సునీల్‌రావు



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, మార్చి 15: నగర శివారు ప్రాంతాలు, విలీన డివిజన్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించి దశలవారీగా ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. శుక్రవారం నగరంలోని 1,10 డివిజన్లలో మేయర్ సునీల్‌రావు పర్యటించి దాదాపు రూ. 42 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఒకటి, పది డివిజన్లలో 30 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్‌తో, 12 లక్షల నిధులతో చేపట్టనున్న పనులను కాసర్ల ఆనంద్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోని తీగలగుట్టపల్లి గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. ఇప్పటికే తీగలగుట్టపల్లి ప్రాంతంలోని అనేక సమస్యలను పరిష్కరించామని అన్నారు. విలీన డివిజన్లను సమాంతరంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఐదు మాసాల్లోగా విలీన గ్రామాల డివిజన్లలో పూర్తిస్థాయిలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని అన్నారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతాలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా తొలగిస్తామని అన్నారు. పెద్ద ఎత్తున నిధులు కేటాయించి నూతన మంచినీటి పైపులైను పనులు చేయడం జరుగుతుందని తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం లాంటి అభివృద్ధి పనులు నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే స్ట్రీట్ లైట్ల సమస్యను పరిష్కరించి పలు కాలనీల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించామని అన్నారు. విలీన గ్రామాల డివిజన్లలో మౌలిక వసతులను మెరుగుపరిచి స్థానిక ప్రజల మెప్పు పొందుతామని అన్నారు. వేసవి ముగిసేలోగా టెండర్లు పూర్తై ప్రారంభం చేసిన అన్ని అభివృద్ధి పనులను పూర్తిచేసి వర్షాకాలం వచ్చే వరకు ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చేస్తామని అన్నారు. గత వర్షాకాలంలో చాలా ప్రాంతాల్లో సమస్యలు తలెత్తినా కరీంనగర్‌లో మాత్రం ఎలాంటి సమస్యలు రాలేవన్నారు. ఇంకా ఎక్కడైనా చిన్న చిన్న సమస్యలు దృష్టికి వస్తే వాటిని కూడా పరిష్కరిస్తామని అన్నారు. తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు కూడా కొనసాగుతున్నాయని, వాటి పనులను కూడా త్వరలోనే పూర్తిచేస్తామని అన్నారు. రాబోయే రోజుల్లో రైల్వే ట్రాక్ వెంబడి కూడా పెద్ద డ్రైనేజీ నిర్మాణం చేస్తామని అన్నారు. కట్టరాంపూర్ ప్రాంతానికి కోట్ల రూపాయలను కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. రూ. 30 కోట్లతో గణేశ్‌నగర్ బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టామని అన్నారు. కోతిరాంపూర్ నుంచి శ్రీగిద్దెపెరుమాండ్ల దేవాలయం వరకు స్మార్ట్‌సిటీ పనులు జరుగుతున్నాయని అన్నారు. మంచినీటి సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, ఆయా డివిజన్ల ప్రజలు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెరిగేలా కృషిచేయండి

- డీఆర్వో పవన్‌కుమార్

కరీంనగర్ టౌన్, మార్చి 15: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా అధికారులు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) పవన్‌కుమార్ సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి స్వీప్ కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఓటర్లందరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కాలేజీల్లో విద్యార్థులకు, స్వశక్తి మహిళా సంఘాల్లోని మహిళలను చైతన్యవంతులను చేయాలని పేర్కొన్నారు. రెండు చోట్ల ఓటు హక్కు ఉంటే ఒక చోట తొలగించాలని, వయస్సుపై బడిన వారు కొత్తగా ఓటు నమోదుకు వస్తే పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ఓటర్ల మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు వివిధ అంశాలపై అధికారులు చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఓటింగ్ జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో డీపీవో రవీందర్, మెప్మా పీడీ రవీందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, డీఈవో జనార్ధన్‌రావు, జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, ఎన్‌వైకె కో ఆర్డినేటర్ వెంకట రాంబాబు, తహసీల్దార్లు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

లలితాంబికా విగ్రహాల ఊరేగింపు



విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు


రాయికల్, మార్చి 15: రాయికల్ పట్టణ కేంద్రంలోని లలితాంబిక దేవాలయంలో 16 రోజుల పండుగలో భాగంగా లలితాంబికా ఉత్సవ విగ్రహాలను పట్టణ పురవీధుల గుండా, మంగళ వాయిద్యాల మధ్య ఊరేగించారు. అనంతరం దేవాలయంలో మాతలచే బోనాలు, మంగళహారతుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ గురూజీ, ఆలయ కమిటీ అధ్యక్షుడు తమ్మినేని గంగాధర్, సభ్యులు సురతాని భాగ్యలక్ష్మి, తోకల రాజేందర్, సుభాష్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

వెల్గటూర్, మార్చి 15: వేసవి కాలంలో వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం చెగ్యాం, శాఖాపూర్, మారేడు పల్లి గ్రామాలలో ఉపాధాహామి కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్లు అందజేశారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జగన్నాథం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి భూ సర్వే

● ఆందోళనలో రైతులు ● భూములకు మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్



కొత్తపల్లి శివారు భూముల్లో సర్వే చేస్తున్న అధికారులు



రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

వెల్గటూర్, మార్చి 15: గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా వెల్గటూర్ మండలం స్తంభంపల్లి, కొత్తపల్లి శివారులో నేషనల్ హైవే అథారిటీ అధికారులతో కలిసి రెవెన్యూ అధికారులు భూ సర్వే చేపట్టారు. ఆర్మూర్ నుంచి జగిత్యాల మీదుగా మంచిర్యాల వరకు 131.8 కిలోమీటర్లు ఎన్ హెచ్ 63ని గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేగా రూపొందించడానికి రూ.3,850 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. జగిత్యాల జిల్లాలో మెట్‌పెల్లి నుండి ప్రారంభమై రాయపట్నం వద్ద ముగియనున్నది. సుమారు 36 కిలోమీటర్లు మేర గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణం జరుగనున్నట్లు అధికారులు తెలిపారు.

వెల్గటూర్ మండలంలో 1.92 కిలో మీటర్లు రోడ్డు నిర్మాణం జరుగనుంది. ఈ మేరకు జిల్లాలో కలెక్టర్ ఆదేశాల మేరకు రోడ్డు నిర్మాణానికి రెవెన్యూ అధికారులు భూ సర్వే ప్రారంభించారు. వెల్గటూర్ మండలంలో నేషనల్ సర్వే అథారిటీతో కలిసి ఆర్ఐ రాజేశ్వరి, రికార్డు అసిస్టెంట్ సంతోష్, సర్వేయర్ మహేష్‌లు సర్వే నిర్వహిస్తున్నారు. ఎక్కువ శాతం భూములు వరం గల్-రాయపట్నం రాష్ట్ర రహదారిని ఆనుకొని ఉండడం వలన భూములకు అధిక ధర వస్తుందని రైతులు ఆనందించేవారు. కానీ ఉరుము లేని పిడుగులా రెవెన్యూ అధికారులు వచ్చి తమ భూముల్లో సర్వే పనులు చేపడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నేషనల్ హైవే నిర్మాణంలో తమ విలువైన భూములు పోతున్నా యని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదట ఆర్మూర్ నుంచి జగిత్యాల మీదుగా మంచిర్యాల వరకు రోడ్డును నిర్మించడానికి నిర్ణయించిన రూట్‌లో కాకుండా రూట్ మార్చి తమ పొలాల మీదుగా రోడ్డు వేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం తమ భూములకు బహిరంగ మార్కెట్‌లో ఉన్న విలువ ప్రకారం ధర చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. భూములు కోల్పోతున్న రైతుల కుటుంబాల వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

● గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు విస్తరణ పనులు

నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే విస్తరణ పనులు నిజమాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ప్రారంభమై పడిగల, అంక్సాపూర్, కమ్మరిపల్లి, మెట్‌పల్లి, చెల్గల్ మీదుగా జగిత్యాల, జగిత్యాల రూరల్ మండలం పొలాస, బుగ్గారం మండలం యశ్వంత్‌రావుపేట, బుగ్గారం, మద్దునూర్ గండి మీదుగా ధర్మపురి మండలం రాయపట్నం మీదుగా వెల్గటూర్ మండలం స్తంభంపల్లి, శివారు లోని గోదావరి నదిని దాటుతుంది.

గోదావరి అవతలి వైపు నుంచి మోదెల, లక్షెట్టిపేట, తిమ్మాపూర్, ఇటిక్యాల్, పోతెపల్లి, గెల్లకోట, మిట్టపల్లి, హాజీపూర్, నర్సింగాపూర్, గుడిపేట, ముల్కాల మీదుగా మంచిర్యాల వరకు రోడ్డు నిర్మాణ పనులు సాగనున్నాయి.

రైతులు కోల్పోతున్న భూములు

గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా వెల్గటూర్ మండలం స్తంభంపల్లి, కొత్తపల్లి శివారులోని వ్యవసాయ పట్టా భూములను రైతులను కోల్పోనున్నారు. వివిధ సర్వే నంబర్లలో రైతులు సుమారుగా కోల్పోయే వ్యవసాయ భూమి వివరాలు అధికారులు అంచనావేశారు. సుమారు 20 సర్వే నంబర్లలో 48 ఎకరాల భూమిని రైతులు కోల్పోనున్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. మండలంలో 1.92 కిలోమీటర్ల పొడవు హైవే రోడ్డు నిర్మించనున్నారు. ఎంజైమెంట్ సర్వే, సబ్ డివిజన్ సర్వే పూర్తి అయిన తరువాత రైతులు ఎంత మొత్తంలో భూమిని కోల్పోతున్నారో ఖచ్చితంగా చెప్పవచ్చని తహసీల్దార్ శేఖర్ తెలిపారు. ఆయా సర్వే నంబర్ల లోని రైతులు తమ భూమి రికార్డులు అధికారులకు చూపించాలని పేర్కొన్నారు. సర్వే పూర్తి అయిన తరువాత ఎంజైమెంట్, సబ్‌డివిజన్ రికార్డులు ఏడీ, జిల్లా కలెక్టర్, ఆర్‌డీవోలకు పంపనున్నారు. అప్రూవల్ అయిన తరువాత అధికారులు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. అప్పుడు రైతులు తమ భూమి ఎంత పోతోంది అనే విషయం తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

మార్కెట్ ధర చెల్లించాలి
అనెవేని బుచ్చయ్య, రైతు



రోడ్డు నిర్మాణం కింద మా విలువైన భూములు పోతున్నాయి. భూమిని నమ్ముకొని వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నాం. ఇప్పుడు ఉన్న కాస్త భూమి పోతోంది. ప్రభుత్వం మా విలువైన భూములకు మార్కెట్ ధర చెల్లించాలి. భూములు పోతున్న రైతుల కుటుంబాలకు ఉద్యోగావకాశం కల్పించాలి.

రైతులు సహకరించాలి: తహసీల్దార్ శేఖర్



నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణానికి అధికారులు చేపడుతున్న సర్వేకు రైతులు సహకరించాలి. సర్వే పూర్తి అయిన తరువాత ఏడీ, కలెక్టర్, ఆర్‌డీవోలకు రిపోర్టు పంపిస్తాం. అప్రూవల్ అయ్యాక ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేస్తారు. అప్పుడు ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చు. రైతుల ముందే సర్వే అధికారులకు రైతులు భూ వివరాలు ఇచ్చి సహకరిస్తే తప్పులు దొర్లకుండా ఉంటుంది.

స్టడీ మెటీరియల్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, మార్చి 15: ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు రూ.1500 చొప్పున బుక్ ఫండ్ లేదా స్టడీ మెటీరియల్ అందించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ జిల్లా స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలోని బీసీ అభ్యర్థులకు టీచర్స్ (ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్) రిక్రూట్‌మెంట్ 2024 (పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన నోటిఫికేషన్) కోసం దరఖాస్తు చేసుకున్న 10,000 మంది బీసీ (ఏబీడీ) అభ్యర్థులకు రూ.1500 చొప్పున బుక్ ఫండ్ లేదా స్టడీ మెటీరియల్ ఖర్చును అందించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన బీసీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో www.tsbcstudy circle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా నేటి నుంచి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్కూల్ అసిస్టెంట్‌కు సంబంధించి గ్రాడ్యుయేషన్, బీఎడ్, టెట్, ఎస్జీటీలకు సంబంధించి ఇంటర్మీడియట్, డైట్, టెట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 040-24071178, 040-27077929 సంప్రదించాలని సూచించారు.

రూ.7,800 పలికిన పత్తి ధర



జమ్మికుంట, మార్చి 15: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,800 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 43 మంది రైతులు 497 క్వింటాళ్ల విడి పత్తి, ఐదుగురు రైతులు తొమ్మిది క్వింటాళ్లు గొనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ. 7,800, కనిష్ఠ ధర రూ. 6300 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు. శని, ఆదివారాలు సాధారణ సెలవు దినాలు కావడంతో తిరిగి సోమవారం మార్కెట్లో క్రయ విక్రయాలు ప్రారంభం కానున్నాయి.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతి చెందిన రైతు మల్లయ్య

మానకొండూర్, మార్చి 15 : మండలంలోని దేవంపల్లికి చెందిన మంద మల్లయ్య (54) అనే రైతు శుక్రవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య పొలానికి నీరు పెట్టేందుకు వెళ్తుండగా పొలం వద్ద విద్యుత్ వైరు తెగి పడి ఉండడంతో గమనించని మల్లయ్య కాలుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు.

పశువైద్యుల సంఘం డైరీ ఆవిష్కరించిన మంత్రి



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, మార్చి 15 : తెలంగాణ పశువైద్యుల సంఘం ఆధ్వర్యంలో 2024 సంవత్సర డైరీని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రిని సంఘనాయకులు ఘనంగా సన్మానించారు. మాచర్ల గార్డెన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో డైరీని ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ కార్యక్రమంలో ఆనాటి ప్రభుత్వ అనాలోచిత చర్యల మూలంగా క్షేత్రస్థాయిలో మూగజీవాలకు వైద్యం చేసే పశు వైద్యులు మనోవేదనకు గురై ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఈ విచారణను త్వరగా ముగించి పాడి, జీవాలపై ఆధారపడిన రైతులకు సేవలను విస్తరించి, తెలంగాణ రాష్ట్రాన్ని పాల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలుపుతామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వెటర్నరీ అసోసియేషన్ అధ్యక్షులు సురేందర్‌రెడ్డి, శ్రీధర్, విజయభార్గవ్, శ్రీనివాస్ రెడ్డి, నరేష్, లింగారెడ్డి, తెలంగాణ పశు వైద్యశాస్త్ర చికిత్సకుల సంఘం అధ్యక్షుడు విష్ణు, కార్యదర్శి చంద్రశేఖర్, వివిధ జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

విద్యతోనే ఆర్థిక, సామాజికాభివృద్ధి

మహిళా డిగ్రీ కళాశాలలో స్త్రీచైతన్య సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కొర్వి వినయకళ

గణేష్‌నగర్, మార్చి 15: సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా సాంస్కృతికంగా నిలదొక్కుకునేందుకు స్త్రీలకు ఏకైకసాధనం విద్య ఒక్కటేనని గురుకుల కళాశాలల పూర్వ ప్రత్యేక అధికారి, ఆంగ్ల అధ్యాపకులు డా. కొర్వి వినయకళ ఉద్బోధించారు. కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో జరిగిన చైతన్య సదస్సులో ముఖ్య వక్తగా పాల్గొన్న వినయకళ 'చదువు, సాహిత్యం, స్త్రీచైతన్యం' అనే అంశంపై ప్రసంగించారు. లింగవివక్షను కుటుంబపేదరికాన్ని ఎదురించి విజేతగా నిలబడగల శక్తి విద్య ద్వారా మాత్రమే సాధ్యమని పలు ఉదాహరణలతో విశ్లేషించి చెప్పారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య తూము లూరి శ్రీలక్ష్మి మాట్లాడుతూ తాము విద్యార్థులుగా ఉన్నపుడు మహిళలకు ఇన్ని అవకాశాలు లేవని, ఇప్పటి ఆధునికతను విద్యార్థులు ఉపయోగించుకుని జీవితంలో ఉన్నత స్థానంలో నిలువాలని సూచించారు. కార్యక్రమ సమన్వయకర్త తెలుగుశాఖ అధ్యక్షులు డా. మట్టా సంపత్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ స్థానికంగా పనిచేస్తున్న మహిళా అధ్యాపకులను, తమ మధ్యనే ఉన్న కొందరు విద్యార్థుల జీవనగాథలను వివరించారు. వారిని ఆదర్శంగా తీసుకోవాలనిన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం అధ్యాపకులు నారోజు వెంకటరమణ, డా. మల్లోజల లక్ష్మణరావు, గాదెగాని పరిమళ, శ్రీరాముల తిరుపతి, షాలిని, జ్యోతి, అపర్ణ, తెలుగు విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాల విద్య ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

గణేశ్‌నగర్, మార్చి 15: ఎస్సారార్ ప్రభుత్వ కళాశాలలో జరిగిన కళాశాల విద్య జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో కమిటీ చైర్మన్, టీజీసీజీ టీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా కె. సురేందర్‌రెడ్డి కళాశాల విద్యా ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ డైరీని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కళాశాల ప్రిన్సిపాల్ సంఘం అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో సమన్వయం సాధించడం ద్వారా కళాశాలల అభ్యున్నతికి తోడ్పడుతున్నారని అన్నారు. సమావేశంలో తెలంగాణ కళాశాల విద్య ప్రిన్సిపాల్ సంఘం ప్రధాన కార్యదర్శి డా జి. రాజారెడ్డి, డిగ్రీ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ రాష్ట్ర అధ్యక్షుడు వి కామరాజు, నాన్ టీచింగ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ నాగరాజు, ప్రిన్సిపాళ్లు వై సత్యనారాయణ, కె లక్ష్మీనరసయ్య, డా సంతోష్, డా మల్లేశం, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంజన్నకు పంచామృత అభిషేకం

కొండగట్టులో రెండో రోజు ఘనంగా పవిత్రోత్సవాలు



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు

మల్యాల, మార్చి 15: కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధానంలో రెండో రోజు శుక్రవారం పవిత్రోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులకు ఉప నిషత్తు పారాయణం, వేదపఠనం, మూల విరాట్టుకు పంచామృత అభిషేకం, సహస్ర నామార్చన, పంచసూక్త హవనం, మహనివేధన, మంత్ర పుష్పం, శాత్తు మొర తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. సాయం కాలం శ్రీ లక్ష్మీ సహస్రనామ పారాయాణం, కుంకుమార్చన, ఒడి బియ్యం, హనుమాన్ చాలీసా పారాయణలు చేశారు. అనంతరం మూల మంత్ర హవనం, పవిత్రలకు శయ్య, ఫల, పుష్పాదివాసం, బలిహరణం, నివేదన, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను ఆలయ అర్చకులు, వేదపండితులు ఘనంగా నిర్వహించారు. రాత్రి వేళల్లో భక్తులు సామూహిక భజనలు, రామనామ సంకీర్తనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, మార్చి 15: వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాధరణ భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు స్వామివారి కోనేరులో పవిత్రస్నానాలు ఆచరించారు. అనంతరం కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి రాజన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.




అధికారి కాత్యాయనికి స్వామి వారి ప్రసాదాన్ని అందజేస్తున్న తిరుపతిరావు

రాజన్నను దర్శించుకున్న ఐఏఎస్ అధికారి

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్, ఐఏఎస్ అధికారి కాత్యాయని శుక్రవారం దర్శించుకున్నారు. స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం ఆలయ అర్చకులు నాగిరెడ్డి మండపంలో ఆశీర్వచనం ఇవ్వగా ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు



పంట పొలాల మధ్య స్వామివారి ఆలయం

ఏడుకొండలవాడికి నిరాదరణ

● నిర్లక్ష్యానికి గురవుతున్న పురాతన వేంకటేశ్వర ఆలయం

● పట్టించుకొనేవారే కరువు

మల్యాల, మార్చి 15: ఆపద మొక్కులు తీర్చే ఆ దేవుడే నిరాదరణకు గురవుతున్నాడు. ఆ దేవ దేవుడు ఇక్కడ మాత్రం శిధిల ఆలయంలో మగ్గిపోతున్నాడు. రాతితో ఈ ఆలయాన్ని నిర్మించగా, అది ఇప్పుడు కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. మల్యాల మండలం లంబాడిపెల్లి-తక్కళ్లపల్లి గ్రామాల మధ్య గల వేంకటేశ్వర స్వామి ఆలయం. ఈ ఆలయం ప్రస్తుతం పూర్తిగా శిథిలమైంది. ఆలయం చుట్టూ పంట పొలాలు వెలియడంతో కనీసం ఆలయానికి వెళ్లేందుకు కూడా దారి లేకపోగా, పొలం గట్లే రహదారులు అవుతున్నాయి. సుమారు 300 ఏళ్ల క్రితం నిర్మించారని చెబుతున్న ఈ ఆలయం చుట్టూ నాడు పెద్ద గ్రామం ఉండగా, పాడి పంటలతో విరజిల్లేదని, క్రమేపి అక్కడి గ్రామం కనుమరుగవడంతో ఆలయం కూడా నిరాదరణకు గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. ఆలయ గర్భ గుడి కూలిపోతుండగా, ఆలయ రాతి స్తంభాలు చెదురుతున్నాయి. ఆలయం చుట్టూ పిచ్చి చెట్లు, మొక్కలు ఏపుగా పెరగడంతో ఆలయ ప్రాంతం నిర్మానుష్యంగా మారింది. శివలింగం, నంది విగ్రహాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి.

ఈ ఆలయం పూర్తిగా నిరాదరణకు గురికావడంతో భక్తులతో పాటు ఈ ప్రాంత వాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భక్తులు కోరిన కోరికలు తీర్చే దేవుడిగా పేరొందిన ఈ ఆలయాన్ని దేవాదాయ శాఖ తమ ఆధీనంలోకి తీసుకుని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. అంతేగాకుండా ఆలయానికి భూములు ఉన్నాయని, వాటిని వెలికితీయాలని ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.



శివ లింగం, నంది విగ్రహం చుట్టు పేరుకుపోయిన గడ్డి

నాలుగు ఇళ్లలో చోరీ

గంభీరావుపేట, మార్చి 15: గంభీరావుపేట మండలంలో వరుస దొంగతనాలు ప్రజలను వణికిస్తున్నాయి. సముద్రలింగాపూర్‌లో మూడిళ్లలో చోరీ సంఘటన మరవక ముందే మల్లారెడ్డిపేటలో గురువారం రాత్రి నాలుగిళ్లలో చోరీ జరిగింది. తాళాలు వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. జక్కుల మల్లేశం కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి బంధువుల ఊరికి వెళ్లారు. దొంగలు మల్లేశం ఇంటి తాళాలు పగుల గొట్టి ఇంట్లోని 2 తులాల బంగారు నక్లెస్, 10 వేల నగదు ఎత్తుకెళ్లారు. అదే విధంగా పొన్నాల శ్రీదేవి ఇంట్లో తులం బంగారం, 20 తులాల వెండి, ఫర్హానా బేగం ఇంట్లో రూ.30 వేలు, జక్కుల బాలవ్వ ఇంట్లో అర తులం బంగారం, నగదు ఎత్తుకెళ్లారు.

పోలీసుల అదుపులో జగిత్యాల వైద్యుడు..?

జగిత్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నిషేధిత నార్కొటిక్ డ్రగ్స్ దుర్వినియోగం కేసులో జగిత్యాల పాత బస్టాండ్ ప్రాంతానికి చెందిన ఓ ప్రముఖ ఈఎన్‌టీ వైద్యుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నార్కొటిక్ బ్యూరో, డ్రగ్ ఇన్స్‌పెక్టర్‌తో పాటు పోలీసులు సంయుక్తంగా దాడులు చేపట్టి వైద్యుడిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. జగిత్యాలలో పాటు హైదారాబాద్‌లో ఉన్న గృహాల్లో సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. జగిత్యాలకు చెందిన వైద్యుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం చర్చానీయంశంగా మారింది.

యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, మార్చి 15: చదువురావటం లేదని మనస్తాపంతో చెప్యాల అశ్విత్‌కుమార్ (23) శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకటో టౌణా పోలీసులు వివరాల ప్రకారం.... హనుమాన్‌నగర్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ (సిరిసిల్ల జిల్లా) ఎల్లయ్యగౌడ్ భార్య, కూతురు, కొడుకు అశ్విత్‌కుమార్‌లతో హనుమాన్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. అశ్విత్ కుమార్ చదువులో వెనుకబడ్డాడు. ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ కాగా ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాసి పాసయ్యాడు. పైచదువులు చదవలేకపోతున్నానని తరచుగా బాధపడేవాడు. శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో అశ్విత్ కుమార్ తల్లి, సోదరి సామాను కొనుగోలుకు బయటకు వెళ్లారు. తండ్రి ఎల్లయ్యగౌడ్ మరో గదిలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. సామగ్రితో వచ్చిన తల్లి అశ్విత్‌కుమార్‌కు ఫోన్ చేయగా ఎంతకూ ఎత్తలేదు. భర్తకు ఫోన్ చేసి సామగ్రి తీసుకుని ఇంట్లోకి వెళ్లారు. అశ్విత్ గది తలుపులు మూసి ఉండటంతో బలవంతంగా తెరిచేసరికి అశ్విత్‌కుమార్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సహాయంతో కిందకు దించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఎల్లయ్యగౌడ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూరాబాద్‌రూరల్, మార్చి 15: మండలంలోని సింగాపూర్, వెంకట్రావ్‌పల్లె, రాజాపల్లిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హుజూరాబాద్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఎ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సైదాపూర్: సైదాపూర్ మండలంలోని గొడిశాల, వెన్నంపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు ఉన్నందున సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ అంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు, మొలంగూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తగట్టు, మొలంగూర్, గొల్లపల్లి, చింతలపల్లి, లింగాపూర్ గ్రామాల్లో శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఆరు గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఆముదాలపల్లి ఏఈ కుమారస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు ఉన్నందున విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ సిబ్బంది, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

తిమ్మాపూర్: కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌తోపాటు మండలంలోని తిమ్మాపూర్, మహాత్మానగర్, ఎల్ఎండీ కాలనీలో ఈనెల 16న శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వెంకటరమణ ఒకప్రకటనలో తెలిపారు.

ఈ నెల 28న బార్ అసోసియేషన్ ఎన్నికలు


మాట్లాడుతున్న భగవాన్‌రెడ్డి

హుజూరాబాద్ లీగల్, మార్చి 15: హుజూరాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, చీఫ్ ఎన్నికల ఆఫీసర్ కంకణాల భగవాన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హుజూరాబాద్ కోర్టు ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓటు హక్కు కలిగిన 117మంది న్యాయవాదులు ఓటర్ల జాబితాను విడుదల చేశామన్నారు. ఈ నెల 18నుంచి 20వరకు నామినేషన్ల స్వీకరణ, 21న నామినేషన్ల పరిశీలన, 22న ఉపసంహరణ ఉంటుందన్నారు. పోటీ చేసే అభ్యర్థుల ఫైనల్ లిస్టును అదేరోజు నోటీసు బోర్డులో ఉంచుతామన్నారు. 28న ఉదయం 10:30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తామని, అదేరోజు సాయంత్రం ఫలితాలు ప్రకటించనున్నట్లు తెలిపారు.

కుమ్మర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సుభాష్‌నగర్, మార్చి 15: రాష్ట్ర ప్రభుత్వం 16 కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలంగాణ కుమ్మర సంఘం రాష్ట్ర కోశాధికారి ప్రభాకర్ అన్నారు. అలాగే రాష్ట్రంలో 16 లక్షల జనాభా ఉండి, ఎనిమిది లక్షల ఓటర్లు ఉన్న కుమ్మర కులస్తులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదపడే ఫెడరేషన్‌కు నిధులు కేటాయించకుండా గత ప్రభుత్వం ఫెడరేషన్లను నిర్వీర్యం చేసిందన్నారు. కుమ్మర వృత్తిదారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్


విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, మార్చి 15: విద్యార్థులు ఇష్టపడి చదివినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలో జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి చదివే విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, వాటర్ బాటిళ్లను వొడితెల ప్రణవ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివినప్పుడే ముందుకెళ్తారన్నారు. సెల్‌ఫోన్, టీవీలు, సినిమాలకు దూరంగా విద్యార్థులు ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు జోలికి వెళ్లవద్దన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సింగాపూర్ ఎంపీటీసీ గుడిపాటి సరిత-జయపాల్‌రెడ్డి వస్తువులను అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థుల కోసం వాటర్ ప్యూరిఫైయర్‌ను త్వరలో అందజేస్తామని వొడితెల ప్రణవ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో నర్సింహారెడ్డి, ప్రధానోపాధ్యాయులు సమ్మిరెడ్డి, బి తిరుమల, జయపాల్‌రెడ్డి, రత్నం, సొల్లు బాబు, పుష్పలత, కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

సుభాష్‌నగర్, మార్చి 15: మేముసైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేశారు. శుక్రవారం ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఉండడంతో వారికి ఎగ్జామ్ ప్యాడ్స్, ఇతర స్టేషనరీని అందచేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న, శ్రీనివాస్, రూప, హనురుప్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ధర్మారం, మార్చి 15: మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న దొంగలి శివకుమార్‌కు గురువారం తన తండ్రితో కలిసి మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలంలోని పెద్దయ్య గుడికి వెళ్లాడు. అక్కడ ఓ సెల్‌ఫోన్ దొరికింది. శివకుమార్ శుక్రవారం ఉదయం ధర్మారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించాడు. పోలీసులు ఈ సెల్‌ఫోన్ ఎవరిదనే కోణంపై విచారించారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం మోతె గ్రామానికి చెందిన దయ్యాల లింగయ్యదిగా గుర్తించారు. వెంటన్నే అతడిని ఠాణాకు పిలిచి విద్యార్థి శివకుమార్ చేతుల మీదుగా దొరికిన సెల్‌ఫోన్‌ను ఆయనకు అప్పగించారు. విద్యార్థి నిజాయితీపై ఎస్సై సత్యనారాయణ, పోలీసులు, పలువురు ప్రశంసించారు.

కురుమ కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

వీణవంక, మార్చి 15: రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కురుమ యాదవ కులస్థుల కోసం కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని తెలంగాణ రాష్ట్ర యాదవ సంఘం నాయకులు చినాల అయిలయ్య యాదవ్ అన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుతో కురుమ, యాదవ కులస్థుల సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. గత ప్రభుత్వాలు కురుమలను పట్టించుకున్న పాపన పోలేదని వాపోయారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కురుమ యాదవ కులస్థులు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆస్తి, నల్ల పన్నులు సకాలంలో చెల్లించాలి


మున్సిపల్ చైర్‌పర్సన్‌కు పన్ను రశీద్‌ను అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

హుజూరాబాద్, మార్చి 15: సకాలంలో ఆస్తి, నల్ల పన్నులు చెల్లించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. శుక్రవారం ఆమె తన ఆస్తి, నల్ల పన్నును చెల్లించారు. ఈ సందర్భంగా బిల్ కలెక్టర్ మొగిలి, వార్డు ఆఫీసర్ రజితలు పన్ను రశీద్‌లను చైర్‌పర్సన్ రాధికకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇంటి, నల్ల పన్ను బకాయిలు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

బీసీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

- మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రి పొన్నంను సన్మానిస్తున్న బీసీ కుల సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్‌లో చేరుతున్న జడ్పీటీసీ కరుణ

కరీంనగర్ అర్బన్, మార్చి 15: బీసీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వారు ఆర్థికంగా ఎదగాలన్నదే తమ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బీసీ కుల గణన కోసం అసెంబ్లీలో తీర్మానం చేసిన సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆత్మీయ సన్మాన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కుల సంఘాల ఐక్యవేదిక సభకు ఆహ్వాన కమిటీ చైర్మన్ వైద్యుల అంజన్‌కుమార్ అధ్యక్షత వహించగా వివిధ బీసీ కుల సంఘాల ప్రతినిధులు హాజరై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆత్మీయ సన్మానం చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... ఆత్మీయ సత్కారం ఏర్పాటు చేసిన వివిధ బీసీ కులసంఘాలకు ధన్యవాదాలు తెలిపారు. బీసీ బిడ్డగా, బలహీన వర్గాల మంత్రిగా ఇక్కడికి వచ్చానని, అందరు ఆశీర్వదించి, మరింత ముందుకు నడపాలన్నారు. బలహీన వర్గాల బిడ్డగా కుల వృత్తులు మరింత అభివృద్ధిలోకి వచ్చేలా కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసామన్నారు. గతంలో ఉన్న కార్పొరేషన్లు యథావిధిగా కొనసాగుతాయని, వీటిపై అపోహలు పెట్టుకోవద్దన్నారు. కుల వృత్తులు మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను జోడించి ఆధునాతన సౌకర్యాలతో వృత్తులను నూతనంగా తీర్చిదిద్దుతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 16 కార్పొరేషన్‌ల ఏర్పాటు తొలి అడుగని, కార్పొరేషన్ల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేస్తామన్నారు. బీసీ కుల గణన ద్వారా బీసీ వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. బీసీ వర్గాలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వృద్ధి చెందాలంటే ఐక్యంగా ఉండాలని అన్నారు. బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు ఏ కిరణ్‌కుమార్, కేశి పెద్ది శ్రీధర్ రాజు, మెతుకు సత్యం, మడుపు మోహనచారి, నాంపల్లి శ్రీనివాస్, వీర దేవేందర్, రజకసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ పాల్గొన్నారు.

● కొత్తపల్లి జడ్పీటీసీ కాంగ్రెస్‌లో చేరిక..

బీఆర్ఎస్‌కు చెందిన కొత్తపల్లి జడ్పీటీసీ పిట్టల కరుణ, ఆమె భర్త మత్స్యపారిశ్రామిక సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల రవీందర్ వారి మద్దతుదారులు సుమారు రెండు వేల మందితో కాంగ్రెస్‌పార్టీలో చేరారు.

పద్మనాయక కల్యాణమండపంలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వారి మెడలో కాంగ్రెస్‌పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మత్స్యపారిశ్రామిక సంఘం డైరెక్టర్లు, వార్డు సభ్యులు పిట్టల విష్ణు, పిల్లి శ్రీధర్, గుర్రం సత్యం, కోమల తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

శంకరపట్నం, మార్చి 15: మండల కేంద్రంలో కొత్తగట్టు దేవస్థానం చైర్మన్ ఉప్పుగాళ్ల మల్లారెడ్డి ఆధ్వర్యంలోముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రెడ్డి సంఘం నాయకులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల రెడ్డి సంఘం నాయకులు పాల్గొన్నారు.

చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం

గంగాధర, మార్చి 15: గంగాధర ఎంపీడీవో సమావేశ మందిరంలో శుక్రవారం చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల సంరక్షణ, బాల్యవివాహాల నివారణపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో ఎంపీడీవో రాము, ఐసీడీఎస్ సీడీపీవో కస్తూరి, ఎంఈవో వేణుకుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

తిమ్మాపూర్, మార్చి 15: మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగాల లక్ష్మారెడ్డి గురువారం ఆకస్మికంగా మరణించాడు. అతని భౌతికకాయాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం సందర్శించి శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొత్త తిరుపతిరెడ్డి, నాయకులు గోగురి నర్సింహారెడ్డి, తాజొద్దీన్, కొత్త రాజిరెడ్డి, బుదారపు శ్రీనివాస్, కొండల్ రావు, కిషన్ రెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.

'గాయత్రి'లో ఫేర్‌వేల్ డే వేడుకలు

జమ్మికుంట రూరల్, మార్చి 15: జమ్మికుంట పట్టణంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో ఫేర్‌వేల్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ముష్క వీరరాజు మాట్లాడుతూ కళాశాలలో చదువుతో పాటు ఆటలు, కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌పై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. తమ కళాశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ప్రముఖ కంపెనీల్లో జాబ్‌లు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సర్వన కుమారస్వామి, అధ్యాపకులు అంజిబాబు, రమేష్, సాగర్, చంద్రయ్య, కరుణ, భాస్కర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి, మార్చి 15. చొప్పదండి మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు కల్యాణలక్ష్మి పథకం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చిలుక రవీందర్, మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, నాయకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● గంగాధర/రామడుగు: గంగాధరలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కల్యాణలక్ష్మి చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. గంగాధర, రామడుగు, బోయినపల్లి మండలాలకు చెందిన 18 లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గంగాధర తహసీల్దార్ రమేష్ బాబు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మనోహర్, నాయకులు రేమాల రమేష్, బుచ్చయ్య పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి వేడుకలు


ఇల్లందకుంటలో నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

సుభాష్‌నగర్, మార్చి 15: ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కాన్షీరాం జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం స్థానిక బస్టాండ్ సమీపంలో పార్టీ జిల్లా కమిటి ఆధ్వర్యంలో కాన్షిరాం జయంతితో పాటు, ధర్మసమాజ్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షురాలు సాధన పార్టీ జెండా ఆవిష్కరించి, కాన్షిరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాన్షీరాం ఉత్తరభారత దేశంలో రాజకీయేతర పునాదులను బలంగా నిర్మించిన తరువాతనే రాజకీయంగా విజయాన్ని సాధించాడని అన్నారు. ఆయన పని విధానాన్ని స్ఫూర్తిగా తీసుకొని డాక్టర్ విశారదన్ మహరాజ్ తెలంగాణలో 13 ఏళ్ళుగా రాజకీయేతర మూలాలను, మహనీయుల సిద్ధాంతాన్ని, సంస్కృతిక నేపథ్యాన్ని తెలియచేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ సమాజాన్ని చైతన్యం చేశారని గుర్తు చేశారు, ఆ ఉద్యమ పునాదులపైనే ధర్మసమాజ్ పార్టీ పుట్టిందన్నారు. రాష్ట్రం 90శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారంలోకి తీసుకెళ్లే దిశగా తమ పార్టీ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి తాళ్ళ నరేష్, ఉపాధ్యక్షుడు మొదుంపల్లి శ్రీకాంత్, కోశాధికారి రాకేష్, బాబు, రాజేంద్రప్రసాద్, సురేష్, నవీన్, శ్రీనివాస్, డీఎస్‌యూ స్టూడెంట్ వింగ్ బాధ్యులు సదానందం, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణ శివారులోని సిర్సపల్లి క్రాస్ రోడ్ వద్ద బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో కాన్షీరాం జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాన్షిరాం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు మహేందర్, సమ్మయ్య, ప్రశాంత్‌గౌడ్, సమ్మయ్య, కుమార్, శ్రీనివాస్, శ్రీకాంత్, తిరుపతి, రవీందర్, రమేష్, వినోద్, అజయ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల కేంద్రంలో బీఎస్పీ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రేణుకుంట్ల రంజిత్, పుల్యాల నరేష్, వాసాల సంతోష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: కాన్షిరాం సేవలు మరువలేనివని అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు పెద్దెల్లి శ్రీనివాస్ అన్నారు. చొప్పదండిలో కాన్షీరాం జయంతి వేడుక లను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కొత్తూరి మహేశ్, దండె కృష్ణ, రత్నం, రాజలింగం, అంజయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ ప్రజాహిత యాత్రలో స్వల్ప ఉద్రిక్తత


గుండ్లపల్లిలో మహిళలతో బండి సంజయ్


నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గన్నేరువరం, మార్చి 15: ఎంపీ బండి సంజయ్‌కుమార్ చేపట్టిన ప్రజాహిత యాత్ర శుక్రవారం మండలంలో కొనసాగగా యాత్రలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో బండి సంజయ్‌కుమార్ గన్నేరువరం నుంచి కరీంనగర్‌కు లోయర్ మానేరు డ్యాంపై బ్రిడ్జిని నిర్మిస్తామని హామీ ఇవ్వడంతో మండలంలో బ్రిడ్జి సాధన జేఏసీ ఏర్పాటు జరిగింది. ఇప్పటివరకు ఆ హామీ నెరవేరకపోవడంతో శుక్రవారం బండి సంజయ్ మండల కేంద్రానికి రానున్న విషయాన్ని తెలుసుకున్న బ్రిడ్జి జేఏసీ నాయకులు తహసీల్దారు కార్యాలయం వద్ద ఎంపీకి నిరసనగా ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఎన్నికల హామీలు నెరవేర్చని బండి సంజయ్‌కి మండలంలో ఓట్లు అడిగే నైతిక హక్కు కోల్పోయాడని ఫ్లకార్డులతో రోడ్డుపై నిరసన తెలిపారు. ఎంపీగా గెలిచి ఏ ఒక్క అభివృద్ధి పనిచేయని బండి సంజయ్ మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయడం విడ్డూరమని నిరసన తెలిపారు.

పోలీసులు జేఏసీ నాయకు లను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం బండి సంజయ్ గన్నేరువరం చేరుకొని హోటల్‌లో టీతాగి మాట్లాడకుండానే గుండ్లపల్లికి వెళ్లారు. అక్కడ పార్టీ నాయకులతో కలిసి ప్రజాహిత యాత్రను కొనసాగించారు. అరెస్ట్ అయిన వారిలో బ్రిడ్జి జేఏసీ నాయకులు సంపతి ఉదయ్, పుల్లెల జగన్, రాములు, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

తడి పొడి చెత్తపై అవగాహన

సైదాపూర్, మార్చి 15: మండలంలోని లస్మన్నపల్లి గ్రామంలో వీఎస్సార్ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తపై శుక్రవారం అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త వేరు చేసి కంపోస్టు ఎరువులు తయారు చేసే విధానాన్ని గ్రామస్తులకు వివరించారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తిరుపతి, కో-ఆర్డినేటర్ అశోక్, హరీష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


లస్మన్నపల్లిలో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

పన్నుల వసూళ్లపై మున్సిపల్ సిబ్బంది దృష్టి


పన్ను రశీదును అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది(ఫైల్)

హుజూరాబాద్, మార్చి 15: హుజూరాబాద్ మున్సిపల్ సిబ్బంది పన్నుల వసూళ్లపై దృష్టి సారించారు. డబ్బులు చెల్లించని వినియోగదారుల ఇళ్లకు ఒకటికి మూడు సార్లు తిరుగుతున్నారు. ఇప్పటి వరకు 83శాతం ఇంటి, 28శాతం నల్లా పన్నులు వసూళ్లయ్యాయి. మిగితా పన్నుల వసూళ్ల కోసం కసరత్తు చేస్తున్నారు. హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 8,364ఇండ్లు, 361దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా ఇంటి పన్నులు రూ.2.43కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.2.03కోట్లు వసూళ్లయ్యాయి. నల్లా పన్నులు రూ. 2.41కోట్లు రావాల్సి ఉండగా, కేవలం రూ. 50లక్షలు మాత్రమే వసూళ్లయ్యాయి. బకాయిల వసూళ్లపై మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ నెల 31తో పన్నుల వసూళ్ల గడువు ముగియనుంది.

వంద శాతం పన్ను వసూళ్లపై దృష్టి పెట్టాం

- సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, హుజూరాబాద్

హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో వంద శాతం పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాం. ఇప్పటి వరకు 83శాతం ఇంటి పన్ను, 28శాతం నల్లా పన్నులు వసూళ్ల చేశాం. మిగితావి ఈ నెల గడువులోగా పూర్తి చేస్తాం. పన్నులు చెల్లించని వారు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలి.

'గంగలో విషనాగులు'

పుస్తక పరిచయ సభ రేపు

కరీంనగర్ కల్చరల్, మార్చి 15: ప్రజ్ఞాభారతి, జాతీయ సాహిత్య పరిషత్, సమాచార భారతి సంయుక్త నిర్వహణలో ఆదివారం ఉదయం 10 గంటలకు వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో రాజీవ్ మల్హోత్రా, విజయ విశ్వనాథ్ రచించిన 'ద స్నేక్స్ ఇన్ గంగ' తెలుగు అనువాదం 'గంగలో విషనాగులు' పుస్తక పరిచయ సభ నిర్వహిస్తున్నట్లు మందల నగేశ్ రెడ్డి, గాజుల రవీందర్, తడిగొప్పుల శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా ఆర్డీవో మహేశ్వర్, ప్రధాన వక్తగా పుస్తక తెలుగు అనువాదకుడు డాక్టర్ బొమ్మరాజు సారంగపాణి, తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. సాహిత్యాభిమానులు, కవులు, రచయితలు ఆయా సంస్థల బాధ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సాయిబాబా ఆలయ హుండీల లెక్కింపు

కరీంనగర్ కల్చరల్, మార్చి 15: దేవాదాయశాఖ పరిధిలోని సాయినగర్ విజయగణపతి సాయిబాబా దేవాలయ, బస్టాండ్‌లోని హుండీలను శుక్రవారం పెద్దపల్లి జిల్లా ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సుజాత పర్యవేక్షణలో లెక్కించారు. ఆలయంలో హుండీల ద్వారా 4,73,071 రూపాయలు, బస్టాండ్ హుండీ ద్వారా 43,564 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ఎండపెల్లి మారుతి తెలిపారు. లెక్కింపులో ఇన్‌స్పెక్టర్, ఈవోతో పాటు చైర్మన్ నలువాల ప్రకాశ్‌పటేల్, వ్యవస్థాపక ధర్మకర్తలు చిట్టుమల్ల కొండయ్య, ఆయిం దాల లక్ష్మయ్య, జూనియర్ అసిస్టెంట్‌లు గుడికాడి శ్రీనివాస్, పిట్టల అంజయ్య, అర్చకులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ పాఠశాల వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న విద్యార్థులు

రామడుగు, మార్చి 15: మండలంలోని వెదిర గ్రామంలోని అల్ఫోర్స్ ఇంటర్నేషనల్ పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి కెప్టెన్ డాక్టర్ బి మధుసూధన్‌రెడ్డి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్యార్థులకు అన్ని రకాలుగా తోడ్పాటు అందించినట్లయితే సంచలన విజయాలను అందిపుచ్చుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రేరణ పేరిట నిర్వహించిన వార్షికోత్సవం విద్యార్థులను ఆలోచింపజేశాయి. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. వార్షిక ప్రణాళికల్లో భాగంగా నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

మానకొండూర్, మార్చి 15 : మండలంలోని ఊటూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు కరీంనగర్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సైకిళ్లు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ సంయుక్తంగా వెల్జన్ సంస్థ సహకారంతో సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఎ రాజిరెడ్డి, పి వేణుగోపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు

చొప్పదండి, మార్చి 15 మండలంలోని కొలిమికుంట గ్రామంలో వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదంలో శుక్రవారం వానరం మృతిచెందగా గ్రామ ప్రజలు అంత్యక్రియలను నిర్వహించారు.

చీడపీడల నివారణపై అవగాహన

కరీంనగర్‌రూరల్, మార్చి 15: వివిధరకాల పంటల్లో చీడపీడల నివారణ చర్యలపై కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ రైతువేదికలో రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తోట తిరుపతి, ఆత్మ బీటీఎం శ్రీలత, ఏటీఎం రమ్య, ఏఈవో పైడితల్లి, రైతులు పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ

కరీంనగర్ కల్చరల్, మార్చి 15: నగునూరు దుర్గాభవానీ ఆలయంలో వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మకు మనసారె పేరుతో ఆలయంలో మహిళలు సారె, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ జంధ్యం మాధవి, వైస్ గవర్నర్ పబ్బ అరుణ, క్యాబినెట్ జాయింట్ సెక్రెటరీ సూర గీత, క్లబ్ అధ్యక్షురాలు చందా విజయలక్ష్మి, సెక్రెటరీ నూనె పద్మావతి, ఉపాధ్యక్షురాలు మాడిశెట్టి ఉమ, సభ్యులు మాధి, లక్ష్మి, స్వరూప, రాణి, దేవి, ప్రశాంతి, భారతి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తీరేనా?

- నేడు చిగురుమామిడి మండల సమావేశం

చిగురుమామిడి, మార్చి 15: మండలంలో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత మండల సమావేశాల్లో సమస్యల పరిష్కారానికి తీర్మానాలు చేసినా అమలు చేయకపోవడంతో ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. శనివారం మండల సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్ శుక్రవారం ప్రకటన జారీ చేశారు. చిగురుమామిడి, చిన్నముల్కనూర్ గ్రామంలో కరీంనగర్-హుస్నాబాద్ వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఏర్పాటు చేసిన వైన్‌షాపులపై, బొమ్మనపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన దుర్గా పౌల్ట్రీఫామ్‌తో చుట్టు పక్కల రైతులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే దానిపై చర్యలు తీసుకోవాలని గత రెండు మండల సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసినా ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల సమావేశంలో చర్చకు వచ్చిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.40.16లక్షలకు దక్కించుకున్న వారసంత

జమ్మికుంట, మార్చి 15: జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, కమిషనర్ ఎండీ అయాజ్ సమక్షంలో శుక్రవారం వారసంత బహిరంగ వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో పాల్గొనేందుకు 21మంది డీడీలు అందజేశారు. 17 మంది గుత్తేదారులు వేలం పాటలో పాల్గొన్నారు. గుత్తేదారు ముద్రవేణ శంకర్ రూ.40.16లక్షలకు వారసంత, తైబజార్‌ను చేజిక్కించుకున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. గత ఏడాది మున్సిపాలిటీకి వారసంత ద్వారా రూ.37.65లక్షల ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో మేనేజర్ ఆర్ భూపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, ఇన్‌చార్జి ఎస్ఐ బోళ్ల సదానందం, తదితరులు పాల్గొన్నారు.